# నీపావళి సిసింద్రీలు
## మినీ మినీ కథలు

**రామ్మూర్తి ఆర్డర్ కాగితాన్ని మడిచి జేబులో పెట్టుకొన్నాడు.**

**అప్పటికే దానిని నాలుగుమార్లు చదివాడు. అది రామ్మూర్తిని ఆ వూరునుంచి మరో వూరికి ట్రాన్స్‌ఫర చేస్తూ బి.డి.ఓ. దగ్గర నుంచి వచ్చిన ఆర్డర్.**




ఆ చిన్న పల్లెలో రామ్మూర్తి సింగిల్ టీచర్. మూడేళ్ళ క్రితం ఆ పల్లెకు ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాడు. ఈ మూడేళ్ళలో ఆ పల్లెవారితో బాగా కలిసి, వారిలో ఒకడిగా అయిపోయాడు. ఆయనంటే పల్లెలో అందరికీ అభిమానం.... పల్లెంటే ఆయనకీ అభిమానం.

అయినా ఇద్దరినీ విడదీస్తూ వచ్చింది ట్రాన్స్‌ఫర్ ఆర్డర్.

దానిని చూడగానే పళ్ళు పటపట కొరికాడు రామ్మూర్తి. తననక్కడనుంచి ట్రాన్స్‌ఫర్ చేయడమంటే ఏదో నరకంలోకి తోస్తున్నట్లు ఫీలయ్యాడు. తను ఇప్పటికి ఎన్ని చోట్లు మారి యిక్కడకు రాలేదు. అయినా ఈసారి ట్రాన్స్‌ఫర్ బాధగానే వుంది.

రామ్మూర్తికి ట్రాన్స్‌ఫర్ వచ్చిందన్న వార్త అప్పటికప్పుడే ఒకరినుంచి మరొకరికి పల్లెంతా తెలిసిపోయింది.

పదిమంది ఏకాఏకిన ఆయనింటికి వచ్చారు.

"ఏంటయ్యా మాస్టారూ! తమర్ని యింకెక్కడికో మార్చినారంట" ఒకాయన అడిగాడు.

అవునన్నట్లు తలూపాడు రామ్మూర్తి.

"మీరు యిక్కడే వుండాలయ్యా! యెక్కడికీ వెళ్ళొద్దు...." మరొకాయన అన్నాడు.

"ఆర్డరొచ్చాక వెళ్ళక తప్పదండి.

కయిపు ఆదిశేషు

అయినా మమ్మల్ని ఒక్కచోటనే వుంచరుగా..." నవ్వుతూ అన్నాడు రామ్మూర్తి

"అదేంటయ్యా! మేమందరమూ మిమ్మల్ని కావాలని పట్టుబడితే...." మరొకాయన అనగానే నలుగురు సమర్థించారు.

"చాలా కష్టమండీ. మీరందరూ ఆఫీసర్ కు ఒక అర్జీ పెట్టుకొంటే.... నేనేకావాలి. మళ్ళీ యిక్కడకు రావచ్చు...." సలహా యిచ్చాడు. అంతకంటే మరేం చెప్పగలడు.

"అలాగేనయ్యా! మీరు వచ్చినాకనే కదయ్యా.... మా పిల్లోళ్ళు నాలుగచ్చరాలు తెల్సుకొన్నారు. మీలాంటోల్ని మరో చోటికి పోనిత్తామేంటి? యిక్కడకు తీసికొచ్చేందుకు యేదయినా చేస్తాం...."

"మన యెమ్మెల్లేని పట్టుకొంటే.... పనవుద్దా మాస్టారూ?" యెమ్మెల్లేతో కాస్త పరిచయమున్న వ్యక్తి ముందుకొస్తూ అడిగాడు.

"ఆయన తలచుకొంటే జరుగుతుంది."

"అయితే యింకేం...." అప్పుడే పని పూర్తయినంత సంబరంగా అన్నాడు మరో వ్యక్తి.

కాసేపాగి. "నేను రేపు వెళుతున్నానండి. మీరంతా కలసి అర్జీ పెట్టి ప్రయత్నించండి. నేనూ నా ప్రయత్నం చేస్తాను నాకూ ఇలాంటి చోటు వదలి వెళ్ళటానికి మనసొప్పటంలేదు." అన్నాడు రామ్మూర్తి చివరగా. అందరూ తలూపారు.

మరునాడు రామ్మూర్తి ఆ పల్లె వదలి.. మరో పల్లెలో జాయిన్ అయ్యాడు. పాత పల్లెవాళ్ళు అర్జీ పెటి ప్రయత్నాలు ప్రారంభించారు

రోజులు గడిచాయి. రామ్మూర్తికి కొత్తపల్లె పాతబడింది. పదిమందీ పరిచయమయ్యారు. పాత పల్లె జ్ఞాపకాలు తగ్గిపోయాయి చాలా వరకు.

పాతపల్లెలోవాళ్లు రామ్మూర్తి మీదుండే అభిమానం కొద్దీ కొంతకాలం ప్రయత్నించారు. కాని క్రమేణా దానిమీద శ్రద్ధ తగ్గిపోయింది. కారణం.... ఆ పల్లెకు క్రొత్తగా వచ్చిన క్రొత్త మాస్టారు పదిరోజులలో పాతపడిపోయాడు. పదిమందికీ అభిమానపాత్రుడయ్యాడు.

మరో మూడేళ్లు గిర్రున తిరిగాయి.

ఒకనాడు రామ్మూర్తికి బి. డి. ఓ. దగ్గరనుంచి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ వచ్చింది. ఉండే పల్లెనుంచి మరో కొత్త పల్లెకు ట్రాన్స్‌ఫర్.

కథ మళ్ళీ మొదటికి వచ్చింది.... రామ్మూర్తి ఆర్డర్ కాగితాన్ని మడిచి జేబులో పెట్టుకున్నాడు ●

---

## ట్రీట్ మెంట్

జబ్బు చేసిన ఆకాశానికి
ఎక్స్-రే తీస్తే
మబ్బుల ఉరఃపంజరంలో
నక్షత్రపు ఎముక విరిగినట్లు
కనిపించింది.
చంద్రుడి గుండెలో అటాక్
బయలుదేరి
కళ తగ్గినట్లు తేలింది.
భయపడి ఆకాశం ఏడిస్తే
కన్నీళ్ళ వర్షం కురిసింది.
ఊరడించి పదిహేను రోజుల్లో
నవచైతన్యపు పౌర్ణమి శస్త్రంతో
ఆపరేషన్ చేసి
ఆక్సిజన్ వెలుగు పవనాన్ని ఎక్కించి
విరిగిన ఎముకను అతికించి
ట్రీట్ మెంట్ చేశాను.

-మా. రా. కృష్ణ

---

చురకలు :

## కావలి

చిన్నింటికి తాళమే కావలి
గొప్పింటికి గూర్ఖాయే కావాలి

అలిశెట్టి ప్రభాకర్